సాక్షి అనంతపురం

మంగళవారం । 5 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



బెటాలియన్‌లో ఆర్చ్ ప్రారంభం

జీకేఎస్ మండలం జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో నిర్మించిన ఆర్చ్‌ను రాష్ట్ర శాంతి భద్రతల, బెటాలియన్స్ ఐజీ శ్రీకాంత్ సోమవారం ప్రారంభించారు.

గరిష్టం/కనిష్టం

36.5°/ 19.7°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

యాజమాన్యం వైఫల్యంతోనే ప్రమాదం!

- 'సప్తగిరి క్యాంఫర్' దుర్ఘటనపై అధికారుల నివేదిక



సప్తగిరి క్యాంఫర్ పరిశ్రమ

శింగనమల: మండలంలోని తోలూరు గ్రామ పంచాయతీలోని సప్తగిరి క్యాంఫర్ పరిశ్రమలో యాజమాన్యం వైఫల్యంతోనే ప్రమాదం సంభవించినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. దీంతో సదరు పరిశ్రమ యాజమాన్యానికి కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. నాలుగు రోజుల క్రితం పరిశ్రమలో రియాక్టర్‌కు మరమ్మతులు చేస్తుండగా కార్బన్ మోనాక్సైడ్ విడుదలై ఆరుగురు సిబ్బంది అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రమాదానికి గల కారణాలపై విచారించిన ఆర్‌డీఓ వసంత్‌బాబు, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, జీఎండీఐసీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. జాగ్రత్తలు పాటించడంలో పరిశ్రమ యాజమాన్యం విఫలమైందని, రియాక్టర్‌లో దిగి పని చేసేటప్పుడు ప్రోటోకాల్‌ను పాటించలేదని, ఆక్సిజన్ పరికరాలు అందజేయలేదని పేర్కొన్నారు. దీంతో సప్తగిరి క్యాంఫర్ పరిశ్రమకు కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అనంతరం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టుల్లో డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ తెలిపారు. మోటార్ వాహనాల ప్రమాద కేసులు, సివిల్, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేస్తారన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'టెట్' ఫలితాల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష' (టెట్) ఫలితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. అక్టోబరు 3 నుంచి 21 వరకు పరీక్షలు జరిగాయి. ఎస్జీటీ అభ్యర్థులకు పేపర్-1ఏ, ఎస్జీటీ స్పెషల్ స్కూల్స్ అభ్యర్థులు పేపర్-1బీ, ఎస్ఏ లాంగ్వేజెస్ అభ్యర్థులు పేపర్-2ఏ, ఎస్ఏ గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల అభ్యర్థులు పేపర్-2ఏ, ఎస్ఏ స్పెషల్ స్కూల్స్ అభ్యర్థులు పేపర్-2బీ పరీక్షలు రాశారు. అన్ని పేపర్లకు కలిపి జిల్లాలో దాదాపు 44 వేల మంది హాజరయ్యారు. జిల్లాలో 9, బెంగళూరులో మూడు మొత్తం 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల ఫలితాలను సోమవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. 93988 10958, 79956 49286, 62817 04160, 79957 89286, 81219 47387, 95056 19127, 81250 46997, 99630 69286, 93988 22554, 93988 22618 నంబర్లలో ఉదయం 11.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

ఓటు గుర్తింపునకు ప్రత్యేక యాప్



యాప్‌ను విడుదల చేస్తున్న రైల్వే ఉన్నతాధికారులు

గుంతకల్లు: త్వరలో జరిగే రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే కార్మికులు తమ ఓటు హక్కు ఎక్కడుందో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా 'వేర్ ఈజ్ మై ఓట్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఏడీఆర్ఎం సుధాకర్ తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్‌తో కలసి యాప్‌ను ఆయన విడుదల చేసి, మాట్లాడారు. ఇండియన్ రైల్వేలో తొలిసారిగా ఇలాంటి యాప్ సృష్టించడం గుంతకల్లు డివిజన్‌కే దక్కిందన్నారు. యాప్‌ను రైల్వే ఉద్యోగి సంపత్ రూపొందించారన్నారు. సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని అందులో పీఎఫ్ నంబర్ ఎంటర్ చేస్తే ఓటర్ ఐడీ నంబర్‌తో పాటు ఏ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవాలనే వివరాలు తెలుస్తాయన్నారు. సంపత్‌ను అధికారులు అభినందించారు.

ఏ మాత్రం దయచూపక..

- గుంతకల్లు పట్టణానికి చెందిన మహమ్మద్ నూర్ రెండు రోజుల క్రితం అనంతపురం నగరంలోని ఓ న్యూరో ఫిజీషియన్ దగ్గరకు వచ్చారు. పరీక్షించిన డాక్టర్ మందులు రాసిచ్చారు. ఆయన రాసిన మందులన్నీ బ్రాండెడ్‌వే. వాటిని కొనేందుకు మహమ్మద్ నూర్ సుమారు రూ.3 వేలు ఖర్చు చేసుకున్నారు. అవే మందులు జనరిక్‌లో అయితే రూ.950కే దొరుకుతాయి.
- అనంతపురం నగరానికి చెందిన దేవానంద్ గుండెజబ్బుతో బాధపడుతున్నారు. ప్రతినెలా మందుల కోసం రూ.5 వేలు ఖర్చు చేసుకుంటున్నారు. డాక్టర్లు బ్రాండెడ్ మందులే రాస్తుండటంతో ఆ మేర ఖర్చవుతోంది. అయితే, అవే మందులు జనరిక్‌లో కేవలం రూ.1,350 విలువ చేస్తుండటం గమనార్హం. ఈ లెక్కన దేవానంద్ ప్రతి నెలా రూ.3,650 నష్టపోతున్నారు.



బ్రాండెడ్ 'మాయ'

- జనరిక్ మందులు రాయని డాక్టర్లు
- భారీగా నష్టపోతున్న రోగులు
- బాధితుల స్థితిగతులను పట్టించుకోని వైద్యులు
- కమీషన్ల కోసం భారం మోపుతున్న వైనం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివరాలు..

డాక్టర్లు	2,000 వరకూ
ఆర్ఎంపీలు	3,000 పైనే
మందుల షాపులు	2,200
రోజుకు అమ్మకాలు	రూ.2 కోట్ల పైనే
ఇందులో బ్రాండెడ్ మందులు	95 శాతం
జనరిక్ మందుల అమ్మకాలు	5 శాతానికి లోపే

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మందుల వినియోగంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. సామాన్య రోగుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ వ్యయమయ్యే మందులు అందించాల్సిన డాక్టర్లు బ్రాండెడ్ మందుల వైపు మొగ్గు చూపేలా ప్రోత్సహిస్తున్నారు. ఏ గ్రామంలో మందుల షాపునకు వెళ్లినా బ్రాండెడ్ మందులే దర్శనమిస్తున్నాయి. పారాసిటమాల్ రూ. 50 పైసలకు వస్తుండగా, దీన్ని కాదని డోలో 650 మాత్రను రూ. 5కు అంటగడుతున్న పరిస్థితి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మినహా ఎక్కడా జనరిక్ మందులు అందించడం లేదు. ప్రధానంగా మధుమేహం, బీపీ, క్యాన్సర్ తదితర జీవనశైలి జబ్బుల బాధితులు బ్రాండెడ్ మందుల ధరల కారణంగా భారీగా నష్టపోవాల్సిన దుస్థితి నెలకొంది.

డాక్టర్లే పక్కదారి పట్టిస్తూ..

జిల్లాలో రమారమి ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 2 వేల మంది వరకూ డాక్టర్లు ఉన్నారు. వీరుకాక మరో 3 వేల మంది వరకూ ఆర్ఎంపీలు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. వీళ్లలో ఏ ఒక్కరూ జనరిక్ మందులు రాయడం లేదు. వాస్తవానికి కొన్ని మందుల ధరల్లో జనరిక్‌కూ, బ్రాండెడ్‌కూ 100 శాతం కూడా వ్యత్యాసం ఉంటుంది. అయితే, డాక్టరు చెప్పాడు కదా, జనరిక్ మందులు వాడితే జబ్బు తగ్గుతుందో లేదోనన్న అనుమానంతో రోగులు కూడా బ్రాండెడ్ మందులే కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి రెండు రకాల మందులూ ఒకేలా పనిచేస్తాయనే విషయాన్ని రోగులకు తెలియజేయాల్సిన బాధ్యత డాక్టర్లదే. కానీ వారు కమీషన్లకు ఆశ పడి బ్రాండెడ్ మందులనే రాస్తూ ఆర్థిక భారం మోపుతున్నారు. ఏటా కోట్లాది రూపాయలను బాధితులు నష్టపోతున్నారు.

బ్రాండెడ్, జనరిక్ తేడా ఇదీ..

ఒక కంపెనీ కొత్త మందును కనుక్కుని, దానికి క్లినికల్ ట్రయల్స్ నిర్వహించి, తర్వాత మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు తమ కంపెనీ పేరు మీద బ్రాండెడ్ మెడిసిన్‌గా ముద్ర వేసుకుంటుంది. ఈ మందుపై ఆ కంపెనీకి 10 సంవత్సరాల పేటెంట్ ఉంటుంది. తర్వాత ఆ మందును ఎవరైనా తయారు చేసుకోవచ్చు. అలా తయారు చేసిన వాటిని జనరిక్ మందులు అంటారు. బ్రాండ్ ఇమేజ్ అవసరం లేదు కాబట్టి తయారీ వ్యయం తక్కువ. డ్రగ్స్ కాంబినేషన్ కూడా అదే ఉంటుంది. అయితే, తయారీలో తేడా లేకున్నా ధరలో మాత్రం భారీ తేడా ఉంటుంది.

జనరిక్, బ్రాండెడ్ కొన్ని మందుల రేట్లలో తేడా ఇలా..

మందు	మాత్రల సంఖ్య	బ్రాండెడ్‌ధర (రూ.లలో)	జనరిక్ ధర (రూ.లలో)
సిఫిగ్జిమ్(200 ఎంజీ)	100	1,250	450
సిట్రిజన్ (10 ఎంజీ)	100	260	20
మల్టీవిటమిన్	100	1,000	300
పారాసిటమాల్(500 ఎంజీ)	100	130	30
మెట్‌ఫార్మిన్(150 ఎంజీ)	100	200	30
డోసిటాక్సిల్ (ఇంజక్షన్)	120 ఎంఎల్	80 వేలు	8 వేలు

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శివనారాయణశర్మ

అనంతపురం అర్బన్: సమస్యలపై ప్రజలు సమర్పించే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్ అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 383 వినతులు అందాయి.

వినతుల్లో కొన్ని..

- తన తల్లి ఎస్.పెద్దక్క పేరున ఉన్న భూమిని ఆన్‌లైన్‌లో తొలగించారంటూ కుమారుడు సతీష్ రెడ్డి ఫిర్యాదు చేశారు. శింగనమల మండలం అలంకారయునిపేట పొలం సర్వే నంబరు 403-8లో 3.78 ఎకరాల భూమికి 1977లో తన తల్లిపేరున డి.పట్టా ఇచ్చారని, ఇందుకు పాసు పుస్తకం కూడా ఉందని చెప్పారు. ప్రస్తుతం అడంగల్‌లో కేవలం 70 సెంట్లు మాత్రమే చూపిస్తున్నారని వాపోయారు. మండల అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే తమకు చావే శరణ్యమని ఆవేదన చెందారు.
- తన ప్లాట్‌ను ఆక్రమించారని ఎ.నారాయణపురం పంచాయతీ స్టాలిన్ నగర్‌కు చెందిన బి.పక్కీరప్ప ఫిర్యాదు చేశారు. నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామ సర్వే నంబరు 95/2లో తన 56వ ప్లాట్‌ను ఇద్దరు వ్యక్తులు ఆక్రమించారని చెప్పారు. విచారణ చేయించి న్యాయం చేయాలని కోరారు.
- ఉరవకొండ పంచాయతీ అధికారులు తన తల్లి మరణధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని అనంతపురం గుల్జార్‌పేటకు చెందిన రాజమన్నారు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసి మూడు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రెడ్‌బుక్ రాజ్యాంగానికి భయపడం

- ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తాం
- కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటాం
- హామీలు అమలు చేసేదాకా బాబును వదిలే ప్రసక్తే లేదు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు

అనంతపురం కార్పొరేషన్: సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగానికి భయపడేది లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైపు ఉన్న బలమైన నాయకత్వాన్ని ఆకర్షించేందుకు, భయపెట్టేందుకు సీఎం చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. 'ఆ రోజు సోనియా గాంధీ, ఈ రోజు చంద్రబాబు, ఎవరికీ భయపడని వ్యక్తి వైఎస్ జగన్. బెదిరిపోయే వ్యక్తే అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆయన సీఎం అయ్యేవారు' అని అన్నారు. చిలకలూరిపేటలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు కృష్ణవేణి, ఇట్లూరి రవికుమార్, శ్రీ సత్యసాయి జిల్లాలో బాలాజీరెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చడం దుర్మార్గమన్నారు. అరెస్టులు చేస్తామంటూ సాక్షాత్తు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరికలు చేయడం సరికాదన్నారు. మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తుండటం, మూడో చాప్టర్ ఓపెన్ చేయబోతున్నామంటూ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడటం దారుణమన్నారు. వెంటనే సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మట్కా విచ్చలవిడిగా సాగుతున్నా, బెల్ట్ షాపులతో మద్యం ఏరులై పారుతున్నా, ఇసుక పక్క రాష్ట్రాలకు తరలివెళ్తున్నా కట్టడి చేయకపోవడం సీఎం చంద్రబాబు చేతకానితనానికి నిదర్శనమన్నారు.

ఎన్ని వేషాలు వేసినా వదలం..

డైవర్షన్ పాలిటిక్స్‌తో ఎన్ని వేషాలు వేసినా చంద్రబాబును వదిలే ప్రసక్తి లేదని ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రబాబు అన్నారు. తిరుపతి లడ్డూ వివాదం, ఎస్సీ నాయకత్వాన్ని అరెస్టు చేయడం, షర్మిలమ్మ ఎపిసోడ్ తీసుకురావడం బాబు డ్రామాల్లో భాగమేనన్నారు. జపాన్ టెక్నాలజీతో రుషి కొండపై భవనాలు అద్భుతంగా కట్టారని, భూకంపం వచ్చినా ఏమీ కాదని గతంలో చెప్పిన చంద్రబాబు.. నేడు అందుకు విరుద్ధంగా మాట్లాడటం తగదన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టుకు వెళ్దామని, అక్కడ వైఎస్ జగన్, చంద్రబాబు పాలనపై పోలికలు చూద్దామని సవాల్ విసిరారు. బాబు నిర్మించిన తాత్కాలిక భవనాల్లో చదరపు అడుగుకు రూ.15,000 ఖర్చు చేశారని, తాను చెప్పింది అవాస్తవమని నిరూపిస్తే తక్షణం రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. 'గతంలో హైదరాబాద్‌లో లేక్ వ్యూ అతిథి గృహానికి ఎంత ఖర్చు చేశారు, కట్టని రాజధాని కోసం జపాన్, సింగపూర్, కజకిస్తాన్, లండన్, చైనాకు ఎందుకు వెళ్లి వచ్చారు, ఈ పర్యటనలకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో చంద్రబాబు చెప్పాలి' అని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.5 వేల కోట్లు ఏమయ్యాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ విభాగం బలోపేతానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. పెన్షన్లలో లక్ష మందికి కోత విధించడం, ఉచిత సిలిండర్ల కార్యక్రమంలో డబ్బు కట్టాలని చెప్పడం చూస్తే ఇది మోసపూరిత ప్రభుత్వమని మరోసారి రుజువైందన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వీరాంజనేయులు, మేయర్ వసీం, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు పెన్నోబులేసు, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, చంద్రలేఖ, నరసింహులు, మాజీ డైరెక్టర్ శోభాబాయి పాల్గొన్నారు.

విధుల్లో నిర్లిప్తత వీడాలి



మాట్లాడుతున్న హోం మంత్రి అనిత



సమావేశంలో పాల్గొన్న డీఎస్పీలు, సీఐలు

- నేరసమీక్షలో రాష్ట్ర హోం మంత్రి అనిత

అనంతపురం: సమాజంలో యూనిఫాం ఉద్యోగాలు చాలా ఉన్నా పోలీసు ఉద్యోగానికి చాలా గౌరవం ఉందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అనంతపురం జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం రాత్రి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల శాంతిభద్రతలపై ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. హోం మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాధ్యత గల డిపార్ట్‌మెంట్‌లో ఉన్నామన్నారు. పోలీసులు ఉన్నారనే నమ్మకంతో ప్రజలు స్వేచ్ఛగా వారి దైనందిన కార్యకలాపాలలో ఉంటున్నారన్నారు. నక్సలిజాన్ని పూర్తిగా అణచివేసిన చరిత్ర రాష్ట్ర పోలీసు శాఖకు ఉందన్నారు. ఇలాంటి మహోన్నతమైన పోలీసులకు చిన్న చిన్న ఘటనలతో మచ్చ రాకూడదన్నారు. అప్రమత్తంగా పనిచేయాలని, ముందస్తు చర్యలతో నేరాల నియంత్రణ చేయాలని, కరుడుగట్టిన నేరస్తులు, రౌడీషీటర్లు, చెడునడత కలిగిన వారి కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. విధుల్లో నిర్లిప్తత వద్దన్నారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పర్యవేక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో కీలక పాత్ర వహించే సీసీ కెమెరాలు అవసరమైనవన్నీ అందజేస్తామన్నారు. టెక్నాలజీని బాగా వాడి..నేరాల కట్టడి, ఛేదింపులో వినియోగించాలన్నారు. మహిళలు, అమ్మాయిలపై అఘాయిత్యాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల, హత్యలు ఆత్మహత్యలు ప్రేరేపించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. వారు మళ్లీ నేరం చేయాలంటే భయపడే విధంగా పనిచేయాలన్నారు. గంజాయి నియంత్రణ పక్కాగా జరగాలన్నారు. విధులలో మంచి సేవలు అందించిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

చిలమత్తూరు తరహా ఘటన పునరావృతం కాకూడదు

చిలమత్తూరు గ్యాంగ్ రేప్ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని లా అండ్ ఆర్డర్ ఐజీ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. పదేపదే నేరాలకు పాల్పడే నిందితులపై లోతైన నిఘా కొనసాగాలన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఈ ఏడాది జరిగిన నేరాలు, రోడ్డు ప్రమాదాలు, పోలీసులు తీసుకున్న చర్యలు, సేవల గురించి ఇరు జిల్లాల ఎస్పీలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి, అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి. రత్న తదితరులు పాల్గొన్నారు.

నేడు డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్

2023 బ్యాచ్ ట్రైనీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్‌ను మంగళవారం నిర్వహించనున్నారు. పీటీసీలో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు హాజరుకానున్నారు.

కార్తీకం.. తేజోమయం

జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. తొలి కార్తీక సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే శివాలయాలలో సందడి నెలకొంది. భక్తులు వెలిగించిన దీపాలతో ఆలయాలు కాంతులీనాయి. కొత్తశోభ సంతరించుకున్నాయి. శివనామ స్మరణతో భక్తజనం పులకించిపోయారు. కరుణించి కాపాడు స్వామీ అంటూ వేడుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం









ప్రత్యేక అలంకరణలో తాడిపత్రి బుగ్గ రామలింగేశ్వరుడు, అనంతపురంలోని పాతూరు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు, రాయదుర్గం మార్కండేయ స్వామి ఆలయంలో దీపాలు వెలిగించిన దృశ్యం, మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 100 వినతులు

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (స్పందన)కు వివిధ సమస్యలపై వంద వినతులు అందాయి. ఎస్పీ పి.జగదీష్ స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకున్న చట్టపరిధిలో ఉన్న వాటికి తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అనధికార విధులపై విచారణ పూర్తి

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అనధికారిక విధులు నిర్వర్తిస్తున్నారన్న ఆరోపణలపై కడప ఆర్‌డీఎంఏ డాక్టర్ రామగిడ్డయ్య సోమవారం విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంత మంది ఉద్యోగులను డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి రప్పించుకుని విడివిడిగా విచారణ చేసి, లిఖితపూర్వక స్టేట్‌మెంట్ తీసుకున్నారు. దాదాపు 10 నుంచి 15 మంది ఉద్యోగులు జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల్లో పని చేస్తున్నట్లు చెబుతూ.. వారంలో రెండ్రోజులు మౌఖిక ఆదేశాల మేరకు పని చేస్తున్నామని విచారణలో అంగీకరించినట్లు తెలిసింది. ఆర్‌డీఎంఏ డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ... విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాలపై తదుపరి చర్యలుంటాయని తెలిపారు. ఈ విచారణలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీలో సంస్కృతం కోర్సు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో సంస్కృతం సర్టిఫికెట్ కోర్సును అందుబాటులోకి తెచ్చారు. న్యూఢిల్లీలోని సెంట్రల్ సంస్కృత యూనివర్సిటీ సౌజన్యంతో దూరవిద్య విధానంలో కోర్సును అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఏడాది కాల వ్యవధితో కూడిన ఈ కోర్సుకు 15 సంవత్సరాల వయస్సు పైబడిన వారు ఎవరైనా అభ్యసించవచ్చునన్నారు.

- రాయదుర్గం నియోజకవర్గంలోని ఓ వ్యక్తికి హెచ్‌ఐవీ నిర్ధారణ అయింది. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆయనకు ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున పింఛన్ అందజేస్తూ ఆర్థిక భరోసా కల్పించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ కారణాలు చూపుతూ ఆయనకు అందాల్సిన పింఛన్‌ను నిలిపి వేశారు. దానిని పునరుద్ధరించుకునేందుకు సదరు హెచ్‌ఐవీ బాధితుడు నానా తిప్పలు పడ్డాడు. చివరకు అప్‌డేట్ చేసినా అధికారులు పంపిన జాబితాలో మాత్రం పేరు లేదు. దీంతో గట్టిగా అడగలేక, పింఛన్ సొమ్ము పోగొట్టుకోలేక లోలోనే మదన పడుతున్నాడు. వ్యాధి కంటే ఈ దిగులే ఎక్కువ కావడంతో అతని ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోంది.

- ఉరవకొండ నియోజకవర్గ పరిధిలో నాలుగు నెలల క్రితం ఓ వ్యక్తికి హెచ్‌ఐవీ పాజిటివ్ నిర్ధారణ అయింది. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే మాత్రలు క్రమం తప్పకుండా వాడుతూ ఆరోగ్యం కాపాడుకుంటున్నాడు. అయితే హెచ్‌ఐవీ బాధితులకు ఇచ్చే రూ.4 వేల పింఛన్ కోసం ఆఫ్‌లైన్ ద్వారా సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకున్నా నేటికీ అతిగతీ లేదు. ఏ దిక్కు లేని ఆయనకు ఈ పింఛన్ సొమ్మే ఆధారం కానుంది.

... ఈ పరిస్థితి ఈ రెండు చోట్లే కాదు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ హెచ్‌ఐవీ బాధితులు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమకు ఎంతో అండగా నిలిచిందని, ప్రస్తుతం తమ బాగోగుల గురించి పట్టించుకునేవారే లేరంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెప్పుకోలేని బాధ!

- హెచ్‌ఐవీ రోగులకు అందని పింఛన్లు
- కొత్తగా దరఖాస్తు చేసుకున్నా అతీగతీ లేని వైనం
- సామాజిక భద్రత పింఛన్ వస్తుందో రాదో తెలియని ఆందోళనలో బాధితులు

రాయదుర్గం: రాష్ట్రంలో కూటమి సర్కార్ పింఛన్ల తొలగింపు ప్రక్రియ ఇప్పుడు హెచ్‌ఐవీ బాధితుల వద్దకు వచ్చింది. పింఛన్ ఠంచన్‌గా పెంచుతున్నామని చెబుతున్న ప్రభుత్వం తొలగింపు ప్రక్రియను సైతం నిరాటంకంగా సాగిస్తుండడంతో హెచ్‌ఐవీ బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో 8,868 మంది పీఎల్‌హెచ్‌ఐవీ బాధితులు ఉన్నట్లు జిల్లా కేంద్రంలోని ఏఆర్‌టీ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. వీరంతా దీర్ఘకాలికంగా హెచ్‌ఐవీ మందులు వినియోగిస్తున్నారు. ఇందులో 4,306 మంది పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా, 2,406 మంది ఎదురుచూపులకే పరిమితమయ్యారు.

గతంలో ఆర్థిక భరోసా

హెచ్‌ఐవీ బారినపడిన వారు కొంచెం శక్తివంతమైన మందులు వాడాలి. ఇందుకు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్ అందజేస్తూ వచ్చింది. వీరికి సాధారణ పెన్షన్ వచ్చినప్పటికీ పౌష్టికాహారం కోసం అప్పట్లో హెచ్‌ఐవీ పెన్షన్‌నూ అందించారు. హెచ్‌ఐవీ బాధితులకు ఆర్థిక భరోసానిచ్చే ఈ మహత్తర పథకాన్ని ధ్రువీకరణ పేరుతో కూటమి సర్కార్ కోతలు విధిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే ఇప్పటికే కొందరు లబ్ధిదారులను జాబితా నుంచి తొలగించగా, మరికొంతమంది తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇందుకు వివిధ సాంకేతిక కారణాలు అధికారులు చూపుతున్నారు. చివరకు ఇంటికి కరెంట్ బిల్లు ఎక్కువ వచ్చిన వారిని కూడా జాబితా నుంచి తొలగించినట్లుగా తెలుస్తోంది.

బాధిస్తున్న సర్కార్ చిన్న చూపు

జిల్లా వ్యాప్తంగా ఉండే ఏఆర్‌టీల ద్వారా క్రమం తప్పకుండా మందులు తీసుకుంటున్న వేలాది మంది బాధితుల్లో చాలా మంది హెచ్‌ఐవీ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోలేక పోతున్నారు. దరఖాస్తు చేసుకున్నా పింఛన్ లబ్ధి చేకూరడం లేదంటూ పలువురు వాపోతున్నారు. చివరకు పింఛన్ అందుతుందో లేదో కూడా తెలియని అయోమయంతో మానసికంగా కుదేలవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచనుగా అందే పింఛన్లు కూడా కొన్ని చోట్ల రద్దయ్యాయి. తెలిసో తెలియకో చేసిన తప్పిదానికి దేవుడు వేసిన పెద్ద శిక్ష కంటే కూటమి సర్కార్ తమ పట్ల చిన్న చూపు చూస్తోందనే ఆవేదన అందరిలోనూ వ్యక్తమవుతోంది.

> **న్యాయం చేస్తాం**
>
> పెన్షన్ కోసం హెచ్‌ఐవీ బాధితులు దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంజూరు కావాల్సి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి అర్హత కలిగిన వారికి న్యాయం చేస్తాం. ఇప్పటి వరకూ దరఖాస్తు చేసిన వారిలో 2,406 మందికి పింఛన్ అందజేయాల్సి ఉంది. మరోసారి ఈ జాబితాను అప్‌డేట్ చేయిస్తాం. దీనిపై ఎవరూ ఆందోళన చెందకూడదు.
>
> – డాక్టర్ అనుపమ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

యువకుడి ప్రాణాలు బలిగొన్న మద్యం



మృతుడు రమేష్

కళ్యాణదుర్గం: అతిగా మద్యం సేవించి ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు... కళ్యాణదుర్గంలోని శిరిడీ సాయిబాబా ఆలయ సమీపంలో నివాసముంటున్న మంగలి రమేష్ (36) తండ్రి రామన్న కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో తల్లి, చెల్లెలుతో కలసి ఉంటున్నాడు. వివాహం కాలేదు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రమేష్‌కు కొంత కాలం క్రితం వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించిన ఆయన తన దుకాణం మెట్లపై కుప్పకూలి మృతిచెందాడు. సోమవారం తెల్లవారుజామున అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి తరలించారు. కాగా, రమేష్ మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గార్లదిన్నెలో చోరీ

గార్లదిన్నె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో సోమవారం పట్టపగలే చోరీ జరిగింది. బాధితుడు నల్లప్ప తెలిపిన మేరకు... ఉదయం ఇంటికి తాళం వేసి సమీపంలోని వ్యవసాయ తోటలోకి వెళ్లిన సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో దాచిన 3.50 తులాల బంగారు నగలు, రూ.72వేలు అపహరించారు. మధ్యాహ్నం ఇంటికి చేరుకున్న రైతు కుటుంబసభ్యులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు.

గఫూర్ ఆస్పత్రి ఎండీ బలవన్మరణం



అర్షద్ అయూబ్ (ఫైల్)

అనంతపురం: నగరంలోని సంగమేష్ సర్కిల్‌లో ఉన్న గఫూర్ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ గఫూర్ పెద్ద కుమారుడు, ఆస్పత్రి ఎండీ డాక్టర్ అర్షద్ అయూబ్ (30) ఆత్మహత్య చేసుకున్నారు. ఇదే ఆస్పత్రిలో ఆయన డాక్టర్‌గా పనిచేస్తున్నారు. వ్యక్తిగత కారణాలతో మనస్తాపం చెందిన ఆయన సోమవారం ఉదయం గఫూర్ ఆస్పత్రిలోనే స్వయంగా విషపూరిత ఇంజక్షన్ వేసుకున్నారు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమిస్తుండడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. చికిత్సకు స్పందించక సోమవారం సాయంత్రం ఆయన మృతి చెందారు. డాక్టర్ గఫూర్‌కు ఇద్దరు కుమారులు కాగా, ఇద్దరూ వైద్య వృత్తిలోనే కొనసాగుతున్నారు. ఈ క్రమంలో పెద్ద కుమారుడు అర్షద్ అయూబ్ కోసం ఏకంగా ఆస్పత్రినే కట్టించి ప్రోత్సహించారు. అర్షద్ అయూబ్ మృతిపై ఆస్పత్రి వర్గాలు దిగ్భ్రాంతికి లోనయ్యాయి. ఘటనపై అనంతపురం ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వాణిజ్య పంటగా 'ఆయిల్‌పాం'

- 6 మండలాల్లో 750 ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- వంటనూనె పామాయిల్‌కు మార్కెట్‌లో మంచి ధర
- రైతుకు రాయితీ, మార్కెటింగ్ రూపంలో ప్రోత్సాహం
- ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు వెల్లడి





పామాయిల్ మొక్కలు, చోళసముద్రంలో సాగు చేసిన తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ డీడీ నరసింహారావు

అనంతపురం అగ్రికల్చర్: ఆయిల్‌పాం (పామాయిల్) వాణిజ్య పంటగా రైతులకు మంచి లాభాలు తెచ్చిపెడుతుందని ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు తెలిపారు. ఈ సారి జిల్లాలో 750 ఎకరాల్లో ఆయిల్ పాం సాగు విస్తరించేందుకు రాయితీలు, మార్కెటింగ్ రూపంలో ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. పామాయిల్ తోటల సాగుకు జిల్లాలో ఆరు మండలాలు అనువుగా ఉంటాయని గుర్తించి రైతులను ప్రోత్సహించడానికి కంపెనీలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కూడేరు, కణేకల్లు మండలాల్లో ఎంకే ఆగ్రోటెక్‌కు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాలను ప్రియా ఆగ్రో ఇండస్ట్రీస్‌కు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాలను వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీకి కేటాయించారన్నారు. ఒక్కో కంపెనీకి 250 ఎకరాలు లక్ష్యం విధించినట్లు తెలిపారు.

లాభదాయకం

దేశీయంగా వంటనూనె పామాయిల్‌కు మంచి గిరాకీ, డిమాండ్ ఉంటంతో విదేశాల నుంచి దిగుమతి అవుతోందని ఉద్యానశాఖ డీడీ చెప్పారు. దీన్ని దేశీయంగానే స్వయం సమృద్ధి సాధించాలనే ఆలోచనతో సాగుకు ముందుకు వచ్చే రైతులకు రాయితీలు, మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే 1.74 లక్షల మంది రైతులు 2.27 లక్షల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో పామాయిల్ తోటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఏటా పామాయిల్ గెలలకు ప్రభుత్వమే గిట్టుబాటు ధర ప్రకటిస్తుందన్నారు. దాని ప్రకారం కంపెనీలు కొనుగోలు చేస్తున్నందున రైతులకు లాభదాయకమని తెలిపారు. రైతులకు రక్షణగా 1993 పామాయిల్ చట్టం ఉందన్నారు.

ఖర్చు తక్కువే..

అయిల్‌పాం మొక్కలు ఎకరాకు 57 చొప్పున 9 మీటర్ల దూరంలో నాటుకోవాలన్నారు. ఒక్కో మొక్క ఖరీదు రూ.193 కాగా 100 శాతం రాయితీతో పూర్తిగా ఉచితంగా అందజేస్తామని తెలిపారు. అవసరమైన ఎరువులు హెక్టారుకు 5,250 ప్రకారం నాలుగేళ్లు ఇస్తామన్నారు. మొదటి నాలుగేళ్ల మధ్యలో అంతర పంటలుగా పత్తి, టమాటా, ఇతరత్రా కూరగాయల పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 25 ఎకరాల వరకు రాయితీ వర్తిస్తుందని తెలిపారు. నాటిన నాలుగేళ్ల నుంచి 30 సంవత్సరాల వరకు పంట తీసుకోవచ్చన్నారు. తెగుళ్లు, చీడపీడలు, కూలీల ఖర్చు, ప్రకృతి వైపరీత్యాలు, దొంగలు, దళారుల తాకిడి బాగా తక్కువన్నారు. సాగుకు ముందుకు వచ్చే రైతులు క్షేత్రస్థాయి ఉద్యానశాఖ అధికారులు అలాగే బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండల రైతులు ప్రియా ఆగ్రో కంపెనీ మేనేజర్ సుమంత్ (955878228), కూడేరు, కణేకల్లు మండలాల రైతులు ఎంకే కంపెనీ మేనేజర్ మురళి (9606918644), ఉరవకొండ, వజ్రకరూరు మండలాల రైతులు వాల్యూ ఆయిల్ కంపెనీ మేనేజర్ రామ్మోహన్ (7993739159) ను సంప్రదించాలని సూచించారు.

సాగునీటి వనరులకు రూ.7 వేల కోట్లు కేటాయించండి

- సీఎం చంద్రబాబుకు సీపీఎం బహిరంగ లేఖ

అనంతపురం అర్బన్: జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.7 వేల కోట్లు నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబును సీపీఎం జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రికి బహిరంగ లేఖను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, ఇతర నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ... తుంగభద్ర ఎగువకాలువ ఆధునీకరణ పెండింగ్ పనులకు రూ.500 కోట్లు, తుంగభద్ర డ్యాంకు కొత్త గేట్ల ఏర్పాటులో రాష్ట్ర వాటాగా రూ.70 కోట్లు ఇవ్వాలన్నారు. హంద్రీ-నీవా పంట కాలువ నిర్మాణాలకు రూ.1,200 కోట్లు, ప్రధాన కాలువలో పది వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండేలా సామర్థ్యాన్ని పెంచేందుకు రూ.2 వేల కోట్లు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి భైరవానితిప్ప ప్రాజెక్టుకు, పేరూరు డ్యామ్‌కు నీటిని అందించేందుకు రూ.1,500 కోట్లు, ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణానికి, చెరువులు, కుంటల పటిష్టతకు, ప్రధాన కాలువలకు అనుసంధానం చేసేందుకు అవసరమైన నిదులను ఈ నెలలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి వ్యవసాయాన్ని కాపాడాలంటూ ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వర్గసభ్యులు నాగేంద్రకుమార్, బాలరంగయ్య, సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజినేయులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాల్లో చెత్త తొలగింపు



కసాపురంలో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

గుంతకల్లు రూరల్: కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను ఎట్టకేలకు సోమవారం తొలగించారు. స్వామి దర్శనార్థం ఆలయానికి వచ్చే భక్తులకు అద్దె గదులు ఏమాత్రం సరిపోక ఆలయ ముందు భాగంలో ఉన్న పార్కుల్లోనే నిద్రిస్తుంటారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఆలయ అధికారులు కల్పించకపోగా, ఆలయ పరిసరాల పరిశుభ్రతను సైతం గాలికొదిలేశారు. దీంతో పార్కుల్లో ఎటుచూసినా దుర్గంధం వెదజల్లుతున్న చెత్తకుప్పలే నెలకొన్నాయి. అద్దె గదులు దొరక్క భక్తులు ఆ చెత్తకుప్పల వద్దనే నానా పాట్లు పడుతూ రాత్రిపూట నిద్రించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ అంశంపై 'హనుమా ఇక్కట్లు కనుమా' శీర్షికన సోమవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం ఆలయ పరిసరాల్లోని చెత్తకుప్పలను తొలగించి, పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

ఆన్‌లైన్ గేమ్ తెచ్చిన తంటా

- ఇద్దరు స్నేహితులపై గొడ్డలితో దాడి



రక్తపుమడుగులో వన్నూరుస్వామి

కళ్యాణదుర్గం/కళ్యాణదుర్గం రూరల్: ఆన్‌లైన్ గేమ్ ముగ్గురు మిత్రుల మధ్య చిచ్చు రేపింది. తాను బాగా ఆడుతున్నానంటే తాను బాగా ఆడుతున్నానంటూ ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. కోపోద్రిక్తుడైన ఒక యువకుడు గొడ్డలి తీసుకొచ్చి తన మిత్రుడిపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన మరొక మిత్రుడిపైనా దాడిచేసి గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన వన్నూరుస్వామి(22), హేమంత్(17), రామాంజనేయులు (33) సోమవారం రాత్రి పది గంటల సమయంలో ఒక చోట కూర్చుని సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్నారు. ఈ క్రమంలో ఒకరు సరిగా ఆడటం లేదని, మరొకరు బాగా ఆడుతున్నారని వాదులాడుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహావేశానికి గురైన రామాంజనేయులు పరుగున ఇంట్లోకెళ్లి గొడ్డలి తీసుకొచ్చి వన్నూరుస్వామిపై విచక్షణారహితంగా దాడిచేశాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన హేమంత్‌నూ గొడ్డలితో గాయపరిచాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన వచ్చి గాయపడిన వ్యక్తులను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వన్నూరుస్వామిని అనంతపురం తరలించారు. అనంతరం వన్నూరుస్వామి కుటుంబ సభ్యులు ఆవేశంలో రామాంజనేయులు ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో సామాన్లు బయటపడేసి నిప్పు పెట్టేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నట్లు సమాచారం. దాడికి పాల్పడిన రామాంజనేయులును పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. త్వరలోనే వాస్తవాలు వెల్లడిస్తామని కళ్యాణదుర్గం రూరల్ సీఐ వంశీకృష్ణ తెలిపారు.

ముగిసిన అంతర్ కళాశాలల క్రీడాపోటీలు



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల వేదికగా జరుగుతున్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాల మహిళల క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్ల వివరాలను ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఖోఖోలో శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల విజేతగా నిలవగా రన్నరప్‌ను అనంతపురం కేఎస్ఎన్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల దక్కించుకుంది. బాల్ బ్యాడ్మింటన్‌లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల జట్టు, కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల (అనంతపురం) వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో శంకరానందరగిరి స్వామి డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. అనంతపురం శ్రీవాణి డిగ్రీ కళాశాల జట్టు రన్నరప్‌ను దక్కించుకుంది. టేబుల్ టెన్నిస్‌లో కదిరి ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో అనంతపురం ఎస్ఎస్‌బీఎన్, బాస్కెట్ బాల్ పోటీల్లో హిందూపురం ఎస్‌డీజీఎస్ కళాశాల జట్లు విజేతగా నిలిచాయి. విజేత జట్లను అభినందిస్తూ ట్రోఫీలను ముఖ్యఅతిథులుగా హాజరైన కళాశాల డైరెక్టర్ పి.గోపాల్, ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ అందజేశారు.

మొదటి సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

అటానమస్ మొదటి సెమిస్టర్ ఎగ్జామినేషన్ నోటిఫికేషన్‌ను సోమవారం ఎస్కే యూనివర్సిటీ రెక్టార్ వెంకటనాయుడు, కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి విడుదల చేశారు. ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు అప్లికేషన్ల జారీ ఉంటుంది. 15వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి. ఆ తర్వాత రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 25వ తేదీ లోపు చెల్లించాల్సి ఉంటుంది. ప్రొవిజనల్ పర్మిషన్‌తో పరీక్షలు రాయాలనుకుంటే డిసెంబర్ 9 లోపు రూ.3వేలు అపరాధ రుసుంతో ఫీజు చెల్లించాలి. డిసెంబర్ 10 నుంచి 19 వరకు హాల్‌టిక్కెట్ల జారీ, అదే నెల 20న పరీక్షలు ప్రారంభమవుతాయి.

ఎట్టకేలకు అనంతపురం ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ

అనంతపురం రూరల్: అనంతపురం రెవెన్యూ డివిజన్ అధికారిగా కేశవనాయుడు ఎట్టకేలకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన బదిలీల్లో బాగంగా ఇక్కడ పని చేస్తున్న ఆర్డీఓ మధుసూదన్‌ను కడపకు బదిలీ చేయగా ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ ఆర్డీఓగా రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల ఆర్‌ఓ వసంతబాబును నియమించారు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం పిఠాపురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న కేశవనాయుడును రెగ్యులర్ ఆర్డీఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆయన రాకను రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొంతమంది ఎమ్మెల్యేలు అడ్డుకోవడంతో ఆయన బాధ్యతలు తీసుకోలేదు. దీంతో రాష్ట్ర స్థాయి నాయకులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. సోమవారం బాధ్యతలు స్వీకరించిన కేశవనాయుడు గతంలో జిల్లాలో హౌసింగ్ పీడీతో పాటు వివిధ హోదాల్లో పని చేశారు.

స్వల్ప కాలిక పంటల సాగు చేపట్టండి

- ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు



బుక్కరాయసముద్రం: రబీ సాగులో భాగంగా దీర్ఘ కాలిక పంటలకు బదులు స్వల్పకాలిక పంటల సాగు చేపట్టాలని రైతులకు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు సూచించారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. రబీ ప్రత్యామ్నాయ పంటల సాగును వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయడం ద్వారా ఆర్థిక ఇబ్బందులు దూరమవుతాయన్నారు. పంట మార్పిడి విధానాలను వివరించారు.

- **కంది:** ఎకరాకు 3 నుంచి 4 కిలోల విత్తనాన్ని వేయాలి. భూసారాన్ని బట్టి ఎకరాకు 20 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ వేయాలి. పూత, కాయ దశలో ఉన్నప్పుడు మారుకామచ్చల పురుగు నివారణకు 1 మిల్లీ నోవాల్యూరాన్ లేదా క్లోరిపైరిఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి.
- **పెసర:** ఎకరాకు 6 నుంచి 7 కిలోల విత్తనం అవసరమవుతుంది. వరుసల మధ్య 30 సెంటీమీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. భూసారాన్ని బట్టి ఎకరాకు 20 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్‌ను ఎరువుగా వేయాలి. విత్తిన 20 నుంచి 30 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. తొలి దశలో రసం పీల్చే పురుగులు, పూత... కాయ దశలో మారుకామచ్చల పురుగు నివారణ చర్యలు చేపట్టాలి.
- **జొన్న:** ఎకరాకు 4 కిలోల చొప్పున సాళ్ల మధ్య 45 సెంటీ మీటర్లు, మొక్కల మధ్య 12 నుంచి 15 సెంటీ మీటర్ల దూరం ఉండేలా గొర్రుతో విత్తుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాక్సాం కలిపి విత్తన శుద్ధి చేయాలి. ఎకరాకు 20 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్‌ను ఎరువుగా వేయాలి. విత్తేటప్పుడు 10 కిలోల యూరియా, 30 రోజుల తర్వాత మరో 10 కిలోల యూరియా వేయాలి. కలుపు నివారణకు 800 గ్రాముల అట్రాజిన్ 200 లీటర్ల నీటికి కలిపి తడి నేలకు పిచికారీ చేయాలి. 30 రోజుల తరువాత గుంటకతో అంతర కృషి చేయాలి. మువ్వ ఈగ నివారణకు కార్బోఫ్యూరాన్ గుళికలను ఎకరాకు 4 కిలోల చొప్పున మొక్కల సుడుల్లో వేయాలి.
- **సజ్జ:** ఎకరా విస్తీర్ణంలో సాళ్ల మధ్య 45 సెంటీ మీటర్లు, మొక్కల మధ్య 12 నుంచి 15 సెం.మీ. దూరం ఉండేలా ఒకటిన్నర కిలో విత్తనాన్ని గొర్రుతో విత్తుకోవాలి. ఎకరాకు 50 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 35 కిలోల పొటాస్ ఎరువులను వేయాలి. కలుపు నివారణకు ఎకరాకు 600 గ్రాముల లాట్రాజిన్ మందును 200 లీటర్ల నీటికి కలిపి తడి నేలపై పిచికారీ చేయాలి. 30 రోజుల తరువాత దంతులు లేదా గుంటకతో అంతర కృషి చేయాలి.
- **కొర్ర:** ఎకరాకు 2 కిలోల విత్తనాన్ని విత్తుకోవాలి. సాళ్ల మధ్య 20 నుంచి 22 సెం.మీ., మొక్కల మధ్య 7 సెం.మీ. దూరం ఉండేలా గొర్రుతో విత్తుకోవాలి. ఎకరాకు 35 కిలోల యూరియా, 50 కిలోల సింగిల్ ఫాస్పేట్‌ను వేయాలి.
- **అలసంద:** ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనాన్ని వరుసల మధ్య 30 నుంచి 45 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. భూసారాన్ని బట్టి ఎరువులు వేయాలి.
- **అనుములు:** ఎకరాకు 6 నుంచి 8కిలోల విత్తనాన్ని సాళ్ల మధ్య 1 నుంచి 1.5 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. చీడపీడల నివారణకు పూత, కాయ దశలో ఉన్నప్పుడు 5 శాతం వేపగింజల కషాయాన్ని పిచికారీ చేయాలి.
- **ఉలవ:** ఎకరాకు 10 కిలోల విత్తనాన్ని గొర్రుతో విత్తుకోవాలి. 8 కిలోల యూరియా, 50 కిలోల సింగిల్ ఫాస్పేట్, 15 కిలోల పొటాష్ ఎరువులను విత్తే ముందు భూమిలో చల్లాలి.

క్లుప్తంగా

డీఆర్‌ఓను కలిసిన నూతన కమిటీ



డీఆర్‌ఓ మలోలకు మొక్క అందజేస్తున్న కలెక్టరేట్ యూనిట్ కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్: డీఆర్‌ఓ ఎ.మలోలను రెవెన్యూ ఉద్యోగుల సంఘం కలెక్టరేట్ యూనిట్ నూతన కమిటీ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ అధ్యక్షుడు టి.హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షురాలు వాణిశ్రీ, ఉపాధ్యక్షుడు లీలాకాంత్, ఇతర సభ్యులు డీఆర్‌ఓకు మొక్క అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఉద్యోగుల శ్రేయస్సు లక్ష్యంగా అందరూ సమష్టిగా కృషి చేద్దామని సభ్యులకు సూచించారు.

రేపు చలో కలెక్టరేట్



ఎస్కేయూలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనంతపురం: వసతి దీవెన, విద్యా దీవెన పథకాల కింద పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 6న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. సోమవారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో కరపత్రాలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆవిష్కరించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పరమేష్, రాముడు, మోహన్, సాయి, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సదస్సు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలోని కలాం సెమినార్‌హాల్‌లో ఈనెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ సూపర్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ అనే అంశాలపై మూడు రోజుల పాటు సదస్సు నిర్వహిస్తున్నట్లు కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, కో–కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏఐసీటీఈ–వాణి పథకంలో భాగంగా నిర్వహించే ఈ సదస్సుకు జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు



దివ్యాంగుడికి క్యాలీపర్ అందజేస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం అర్బన్: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ముగ్గురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను (అవయవాలు) అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన క్యాక్రమంలో హిందూపురానికి చెందిన మాస్కిర్‌కు క్యాలిపర్ కృత్రిమ కాలు, గుడివాండ్లపల్లికి చెందిన జయమ్మ, ముదిగుబ్బ మండలం ఈదలవారిపల్లికి చెందిన శ్రీరాములుకు కృత్రిమ కాళ్లను అందించారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్ మాట్లాడుతూ ఒక్కొక్క కృత్రిమ కాలు విలువ రూ.7 వేలు అని చెప్పారు.

33 శాతం రిజర్వేషన్ కల్పించాలి



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని మహిళా సమాఖ్య నాయకురాళ్లు డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా పోరాటం చేస్తున్నా అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఆయన క్యాంప్ కార్యాలయంలో సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతిప్రసాద్, పద్మావతి, తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెలలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య నగర అధ్యక్షురాలు జానకి, శింగనమల నియోజకవర్గ కార్యదర్శి లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల ఉల్లం‘ఘనులు’

నగరంలో రోడ్డు ప్రమాదాలు తరచుగా చోటుచేసుకుంటున్నా.. వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. మితిమీరిన వేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ప్రయాణించి.. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ద్విచక్ర వాహనంలో ముగ్గురికి పైగా ప్రయాణిస్తూ వాహనాలను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇక ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను కుక్కుతున్నారు. ఆటోలు, ఇతర పెద్ద వాహనాల పైభాగంలో ఇష్టారాజ్యంగా ప్రయాణికులను తరలిస్తున్నారు. ఇలా ప్రయాణించే క్రమంలో ఏ చిన్న తేడా వచ్చినా జరిగే ప్రాణనష్టం ఊహించలేం.. వీరి ప్రాణాలతో పాటు ఎదురుగా వచ్చే వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనదారులు



ద్విచక్ర వాహనంలో నలుగురి ప్రయాణం..



ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న యువకుడు



ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న ప్రయాణికులు



బొలెరోలో ప్రమాదకరంగా ప్రయాణం

ఆర్‌ఓబీని శుభ్రంగా ఉంచాలి

అనంతపురం కార్పొరేషన్: రైల్వే ఓవర్ బ్రిడ్జి (టవర్ క్లాక్)ను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేయర్ వసీం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. టవర్‌క్లాక్ బ్రిడ్జిపై చెత్త ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తే.. మళ్లీ రోడ్డుపైకి రాదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.వందల కోట్లతో బ్రిడ్జిను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నిత్యం బ్రిడ్జి సుందరంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. లక్ష్మీనగర్, కోవూర్ నగర్, మారుతీనగర్‌లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెత్తా చెదారం రోడ్డుపై కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తను ఎప్పటికప్పుడు కంపోస్టుకు తరలించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, కమల్‌భూషణ్, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, తదితరులు ఉన్నారు.



బ్రిడ్జిని పరిశీలిస్తున్న మేయర్ వసీం

చెస్ క్రీడాకారులకు అభినందన

అనంతపురం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 26, 27 తేదీల్లో అండర్–19 చెస్ టీమ్ ఈవెంట్ చాంపియన్‌షిప్ పోటీలు కర్నూలులో జరిగాయి. అనంతపురానికి చెందిన క్రీడాకారులు ఆదిత్య రెడ్డి, హన్నీ స్టీఫెన్, మిస్బా, విశ్వనాథ్, సాయి తరుణ్ అద్భుత ప్రదర్శనతో మొదటి స్థానంలో నిలిచి, బంగారు పతకం సాధించారు. ఈ జట్టుకు ఆదిత్య రెడ్డి కెప్టెన్‌గా వ్యవహరించారు. బాలికల జట్టుకు కెప్టెన్ అనన్య వ్యవహరించింది. బాలికల జట్టులో అభిగ్న, క్లారా, భువన కృతి, సోహా అఫ్రీన్ అద్భుతంగా ఆడి మూడో స్థానం దక్కించుకున్నారు. కాంస్య పతకాన్ని సాధించారు. సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ ఏ.మలోల, డీఎస్‌డీఓ షఫీ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

ఘనంగా శకుంతల దేవి జయంతి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రపంచంలో అతివేగంగా గణనలు చేసి గిన్నిస్ రికార్డ్‌కు ఎక్కి ‘మానవ గణన యంత్రం’గా పేరు సంపాదించిన శకుంతల దేవి జయంతిని సోమవారం స్థానిక కేఎస్‌ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కే.సత్యలత, గణిత శాస్త్ర శాఖాధిపతి గౌసియా సుల్తానా మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలంటే తర్కబద్ధమైన నైపుణ్యాలు అలవర్చుకోవాలన్నారు. విశ్వమంత గణితాన్ని తన మెదడులో భద్రపరుచుకున్న ఏకైక మహిళ శకుంతల దేవి అని కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు మెంటల్ ఎబిలిటీ, అర్థమెటిక్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. ప్రణాళిక ప్రకారం చదివితే ఉద్యోగాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పర్వీన్, ప్రదీప్త, షఫీ, తిమ్మారెడ్డి, రామాంజనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేఎస్‌ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యలత

రైతులకు న్యాయం చేయకపోతే ఉద్యమిస్తాం

ఆత్మకూరు: రైతులకు ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఆత్మకూరును కరువు మండలంగా ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. రైతులకు ఉత్తుత్తి హామీ ఇచ్చి మోసం చేశారని మండిపడ్డారు. రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలన్నారు. పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి, అమలు చేయలేదని తెలిపారు. పొలాల్లో విద్యుత్ మీటర్లు బిగించే కార్యక్రమం విరమించుకోవాలని సూచించారు. రైతులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు రామాంజనేయులు, సరస్వతి, రైతులు ఓబులేసు, ఆదెప్ప, గోపాల్ పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పెట్టుబడి సాయం విడుదల చేయాలి

కనగానపల్లి: వర్షాభావ పరిస్థితులతో పంటలు పండక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ్ డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలను పరిష్కారించాలంటూ రైతు సంఘం నాయకులు సోమవారం మండలంలోని పలు గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా రైతులకు సొమ్ము అందించలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ అమలు చేసి తీరాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందు, మండల కార్యదర్శి నాగరాజు, సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, స్థానిక రైతు సంఘం నాయకులు మల్లికార్జున, అంకె నాగేష్, రాము, ఆదిరెడ్డి, సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.



సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాప్తాడు: మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఉప్పునేసినపల్లికి వెళ్లే దారిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చాపట్ల గ్రామానికి చెందిన యువకుడు రాజు (21) దుర్మరణం చెందాడు. మరో యువకుడు తీవ్ర గాయాలతో బయట పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చాపట్ల గ్రామానికి చెందిన మధు పాల ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం, సాయంత్రం సత్యసాయి జిల్లాలోని చిగిచెర్ల, ఉప్పునేసినపల్లి, అనంతపురం జిల్లాలో చాపట్ల, గొల్లపల్లి, మరూరు గ్రామాల నుంచి పాలను సేకరించి ఎన్‌ఎస్‌గేట్ సమీపంలోని డెయిరీకి పాలు తీసుకెళ్లేవారు. మధుకు ఏదైనా పని ఉన్నప్పుడు డ్రైవర్‌గా అదే గ్రామానికి చెందిన రాజు వెళ్తుండేవాడు. సోమవారం మధుకు పని ఉండటంతో ఆటోకు రాజు, అతని స్నేహితుడు ప్రసాద్‌తో కలిసి వెళ్లాడు. ఆటో శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం రూరల్ మండలంలోని ఉప్పునేసినపల్లి నుంచి గొల్లపల్లికి వస్తుండగా గొల్లపల్లి నుంచి ధర్మవరం వైపు అతివేగంతో వెళ్తున్న బొలెరో (ప్రభుత్వ మద్యం షాపులకు సరఫరా చేసే వాహనం) వాహనం ఢీకొనడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు పక్కనే కూర్చొని ఉన్న అతడి మిత్రుడు ప్రసాద్ ఎగిరి పక్కకు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. బొలెరోలో ప్రయాణిస్తున్న వారికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాజు (ఫైల్)

మగ్గం వర్క్, ట్యాలీలో ఉచిత శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో ఈనెల 13 నుంచి జర్దోసి మగ్గం వర్క్, కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెంది ఉండి ఆధార్, రేషన్ కార్డు కలిగి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 30 రోజుల శిక్షణ కాలంలో ఉచితంగా భోజనం, వసతి కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9618876060, 830991577 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

హోంశాఖ మంత్రికి స్వాగతం



హోంశాఖ మంత్రి అనితకు పూల మొక్క అందజేస్తున్న కలెక్టర్ వి.వినోద్ కుమార్

అనంతపురం: రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సోమవారం జిల్లా పర్యటనకు విచ్చేశారు. నగరంలోని సప్తగిరి సర్కిల్‌లోని అలెగ్జాండర్ హోటల్లో మంత్రి అనితను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించి ఘనంగా స్వాగతం పలికారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: కక్కలపల్లి సమీపంలోని ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాత్రి బర్త్‌డే వేడుకలు జరిగాయి. వేడుకల అనంతరం కొంత మంది వ్యక్తులు అక్కడే ఒక గదిలో కూర్చుని పేకాట ఆడుతూ పట్టుబడినట్లు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కే.సాయినాథ్ తెలిపారు. మొత్తం 11 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1,36,930 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



శ్రీజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: మండలంలోని ముట్టాల ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీజ అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీడీ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అండర్–14 అథ్లెటిక్స్ డిస్కత్రో పోటీలు జరిగాయి. శ్రీజ ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని శ్రీజను పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

అమ్మవారి శాలలో వాసవీ దీక్షలు

అనంతపురం కల్చరల్: వాసవీ దీక్షామాలధారులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అమ్మవారి శాల అధ్యక్షుడు గోపామచ్చానరసింహులు తెలిపారు. సోమవారం కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో దీక్షా నియమ నిబంధనల కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. వచ్చే నెల మండల దీక్షలు, ఆపైన అర్ధమండల దీక్షలు ఉంటాయన్నారు. మహిళలకు 11 రోజుల ప్రత్యేక దీక్షలుంటాయని పేర్కొన్నారు. వాసవీమాత విశ్వరూప దర్శనం, అమ్మవారు వెలసిన వాసవీ పెనుగొండ యాత్ర వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

కరుణించు కాశీవిశ్వేశ్వరా..



శివబాలయోగి ఆశ్రమంలో పూజలందుకున్న అనంతేశ్వరుడు



దీపాలు వెలిగిస్తున్న యువతులు



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

- భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

అనంతపురం కల్చరల్: కాశీవిశ్వేశ్వరా కరుణించి కాపాడు తండ్రి అంటూ భక్తజన ప్రార్థనలతో శివాలయాలు ప్రతిధ్వనించాయి. తొలి కార్తీక సోమవారం రాకతో ఆలయాలలో తెల్లవారు జామునే మహాశివునికి అభిషేకాలు, రుద్రం, చమకం పఠనం జరిగాయి. నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరికి కుంకుమార్చన, రుద్రాభిషేకాలు, శాస్త్రోక్తంగా జరిగాయి. పాతూరులో ప్రసిద్ధ విరూపాక్షేశ్వరాలయంలో సామూహిక దీపోత్సవం కనుల పండువగా సాగింది. అలాగే శారదా శంకరమఠం, శివకోటి, హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ అన్నపూర్ణేశ్వరీ దేవస్థానం, నసనకోట ముత్యాలమ్మ ఆలయం, అరవింద నగర్‌లోని సర్వేశ్వరాలయం మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం తదితర చోట్ల భక్తుల సందడి నెలకొంది. మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు.

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో వెలసిన గౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం చేశారు. అలాగే రాప్తాడులో నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ సమీపంలోని పార్వతి దేవి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలు, నిమ్మకాయల దండలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో శివాలయాలకు చేరుకుని కార్తీక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎక్కడ ఇబ్బంది లేకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి అందరికి దర్శనం కల్పించారు. చిన్మయ నగర్‌లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ప్రెసిడెంట్ రాజుల తిమ్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రెనాటి కొండా రెడ్డి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి మహానంద రెడ్డి చర్యలు తీసుకున్నారు.



రాప్తాడులో పూజలు చేస్తున్న భక్తులు

రూ.50 వేలు పలికిన మామిళ్లపల్లి సంత

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో నిర్వహించే వారపు సంత రూ.50 వేలు పలికింది. గ్రామంలో ప్రతి బుధవారం నిర్వహించే వారపు సంతలో పన్ను వసూలుకు సోమవారం స్థానిక సచివాలయంలో సర్పంచ్ ఓబిరెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి అరుణ్‌పాండే వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో అధికార టీడీపీ నాయకులే పలువురు పోటీపడగా చివరకు వారిలో బోయ నాగేంద్ర రూ.50 వేలకు దక్కించుకున్నాడు. ఈ వేలం కాంట్రాక్టు కాల పరిమితి ఒక ఏడాది వరకు ఉంటుందని కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి అరుణ్‌పాండే